సాక్షి
సూర్యాపేట
బుధవారం, 30, అక్టోబర్, 2024



పండుగ పూట పస్తులేనా..

డిగ్రీ కళాశాలల్లోని గెస్ట్ ఫ్యాకల్టీకి ఐదు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	590.00 అడుగులు
ఇన్‌ఫ్లో	69,386 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	19,880 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	29,476 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	10,120 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	7,110 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	2,400
వరద కాల్వకు	400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	644.00 అడుగులు
ఇన్‌ఫ్లో	908 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	728 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	48 క్యూసెక్కులు
కుడికాల్వకు	నిల్

న్యూస్‌రీల్

జిల్లాలో పలువురు ఎస్‌ఐల బదిలీ

సూర్యాపేటటౌన్ : జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం మల్టీజోన్ 2 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట డీఎస్‌బీలో పనిచేస్తున్న వి.మహేశ్వర్ చివ్వెంల ఎస్‌ఐగా బదిలీ అయ్యారు. అలాగే చివ్వెంల ఎస్‌ఐగా పనిచేస్తున్న బి.వెంకట్‌రెడ్డి సూర్యాపేట పట్టణ వన్ టౌన్ ఎస్‌ఐగా, సూర్యాపేట వీఆర్‌లో ఉన్న బి.శ్రీకాంత్‌గౌడ్ ఆత్మకూర్ ఎస్‌ఐగా బదిలీ అయ్యారు. అలాగే వీఆర్ నల్లగొండలో ఉన్న పి.మధును నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల ఎస్‌ఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

4న ప్రజాభిప్రాయ సేకరణ

భానుపురి (సూర్యాపేట) : బీసీ కమిషన్ చైర్మన్ నేతృత్వంలో నవంబర్ 4వ తేదీన నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో సూర్యాపేట జిల్లాలోని అన్ని కులాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సంచార జాతుల సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణ నిర్వహించనున్నట్లు సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని, జిల్లాలోని వివిధ సామాజిక వర్గాలు, ప్రజాప్రతినిధులు, ఆసక్తి కలవారు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా బీసీ కమిషన్ బృందానికి ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మాట్‌లో 5 సెట్లను అందించాలన్నారు. వారి వాదనలకు మద్దతుగా సాక్ష్యాలను జతపర్చాలని కోరారు.

నేడు జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంప్ హైస్కూల్‌లో 68వ జాతీయ పాఠశాల క్రీడల్లో భాగంగా జిల్లాస్థాయి బాలబాలికల అండర్ -14, 17 టోర్నమెంట్, సెలక్షన్ కబడ్డీ పోటీలు బుధవారం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, పీడీ రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల నుంచి ఎంపికైన బాలబాలికలు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

నీటిని సంరక్షించాలి



మాట్లాడుతున్న చెవిటి వెంకన్నయాదవ్

తుంగతుర్తి: ప్రతిఒక్కరూ నీటిని సంరక్షించాలని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్ అన్నారు. మంగళవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని సంఘమిత్ర కార్యాలయంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షపు నీరు, బోర్లు, బావుల నీటిని వృథా చేయవద్దన్నారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, భూగర్భజల శాఖ ఏడీ బాలు, తహసీల్దార్ దయానంద్, ఎంపీడీఓ శేషుకుమార్, ఏపీఓ కృష్ణ, నర్సింహాచారి, కురుమయ్య, సుల్తానోద్దీన్, సాంబరాజు, మధు, నరేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల

సూర్యాపేటటౌన్ : నేషనల్ హెల్త్ మిషన్ సూర్యాపేట పరిధిలో ఖాళీగా ఉన్న 12 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు ఇచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించి ఎంపికైన అభ్యర్థుల జాబితాను suryapeta.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నోటీసు బోర్డులో ఉంచారని పేర్కొన్నారు. 12 పోస్టుల్లో డిస్ట్రిక్ట్ క్వాలిటీ అష్యూరెన్స్ మేనేజర్-1, ల్యాబ్ క్వాలిటీ మేనేజర్-1, డిస్ట్రిక్ట్ డాటా మేనేజర్-2, ఫార్మసిస్ట్-3, రేడియోగ్రాఫర్-2, ఏఎన్ఎం-2, సపోర్టింగ్ స్టాఫ్- 1 చొప్పున అభ్యర్థులను ఎంపిక చేశారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన నవంబర్ 2వ తేదీన నిర్వహిస్తారన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో పూజలు చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్ అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, దుర్గాప్రసాద్, సీతారామాచార్యులు, రాజేష్ పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు 10,04,284



- ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసిన అధికారులు
- తుంగతుర్తిలో అత్యధికం..
- సూర్యాపేటలో అత్యల్పం

నియోజకవర్గం వారీగా ఓటర్లు	
హుజూర్‌నగర్	2,52,456
కోదాడ	2,46,188
సూర్యాపేట	2,45,140
తుంగతుర్తి	2,60,500

భానుపురి (సూర్యాపేట) : జిల్లావ్యాప్తంగా మొత్తం ఓటర్ల లెక్క తేలింది. మున్సిపాలిటీ, పంచాయతీ అన్ని రకాల ఓటర్లు కలిపి మొత్తం 10,04,284 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించింది. ఇందులో 4,90,826 మంది పురుషులు, 5,13,402 మంది మహిళలు ఉన్నారు. 56 మంది ఇతరులు ఉన్నారు. గత నెలలో పంచాయతీ ఓటర్ల జాబితా ప్రకటించగా 6,82,882 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. అయితే జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించి జాబితాను రూపొందించింది.

స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా..

స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల లెక్క తేల్చింది. అందులో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లాలో 9.85 లక్షల మంది ఓటర్లు ఉండగా.. లోక్‌సభ ఎన్నికల నాటికి 10.02 లక్షల మంది ఓటర్లుగా నమోదయ్యారు. కాగా ప్రస్తుతం ఎన్నికల సంఘం నిర్వహించిన స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో ఓటర్ల సంఖ్య 10,04,284 కు చేరింది.

విలువైన సేవలు అందించిన అదనపు కలెక్టర్

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



అదనపు కలెక్టర్ లతకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : అదనపు కలెక్టర్‌గా బీఎస్ లత విలువైన సేవలు అందించారని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లత బదిలీపై జగిత్యాల జిల్లాకు వెళుతున్న సందర్భంగా మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. లత జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారని అన్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించామన్నారు. అనంతరం జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది అదనపు కలెక్టర్ బీఎస్ లతను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు వేణుమాధవ్, శ్రీనివాసులు, సూర్యనారాయణ, సీపీఓ ఎల్.కిషన్, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ శ్రీనివాస్‌నాయక్, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, డీటీ పద్మారావు, డీటీఓ రవికుమార్, డీఆర్‌డీఓ శిరీష, డీటీడీఓ శంకర్, డీఈఓ అశోక్ కుమార్, ఎస్సీ అభివృద్ధి అధికారి లత, బీసీ అభివృద్ధి అధికారి అనసూయ, డీసీఓ పద్మ పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు ఏర్పాట్లు చేయాలి

ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై జిల్లా స్థాయిలో ట్రైనర్ ఆఫ్ ట్రైనర్స్‌కు, తహసీల్దార్లకు, ఎంపీడీఓలకు, ఏఎస్‌ఓలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు.

మెరుగైన ర్యాంకు సాధనకు..

ఐదు మున్సిపాలిటీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రత్యేక దృష్టి

- తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని ప్రజలకు అవగాహన
- ప్రధాన రహదారుల వెంట హోర్డింగులు ఏర్పాటుకు నిర్ణయం
- చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు



హుజూర్‌నగర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు (ఫైల్)

హుజూర్‌నగర్ : జిల్లాలోని మున్సిపాలిటీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈసారి మెరుగైన ర్యాంకులు సాధించేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. తడి, పొడి చెత్తను వేరువేరు డబ్బాల్లో వేసి ఇవ్వాలని ఆయా వార్డుల ప్రజలకు సూచించినా చాలా మున్సిపాలిటీల్లో 50 శాతం నుంచి 60 శాతం వరకు మాత్రమే ఇలా చేస్తున్నారు. దీంతో పరిస్థితి అనుకున్నంత మెరుగ్గా లేదని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తమ ర్యాంకుల సాధనలో వెనుకబడిపోతున్నారు. అయితే ఈ సంవత్సరం అలాంటి విధానానికి భిన్నంగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.



ఐదు మున్సిపాలిటీల్లో చెత్త ఉత్పత్తి ఇలా.. (మెట్రిక్ టన్నుల్లో)

మున్సిపాలిటీ	వార్డుల సంఖ్య	చెత్త ఉత్పత్తి
సూర్యాపేట	48	58
కోదాడ	35	30
హుజూర్‌నగర్	28	16
తిరుమలగిరి	15	9
నేరేడుచర్ల	15	5

వార్డుల వారీగా అవగాహన కార్యక్రమాలు..

మున్సిపాలిటీల్లో స్వచ్ఛతకు వినియోగించే వాహనాలు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు పారిశుద్ధ్య సిబ్బందికి ప్రజలు ఒకే డబ్బాలో చెత్త వేసి ఇవ్వకుండా అవగాహన కల్పిస్తున్నారు. వార్డుల వారీగా మున్సిపల్ అధికారులు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తడి, పొడి చెత్తను ఎలా వేరు చేయాలో ప్రత్యక్షంగా చూపిస్తున్నారు. భూమిలో కలిసిపోయే కూరగాయలు, ఇతర వ్యర్థాలు, కుళ్లిన పండ్లు, ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలను ఆకుపచ్చ రంగు డబ్బాలో వేయాలని సూచిస్తున్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు, ఇనుప ముక్కలు, కాగితాలు, అట్టాలు ఇతర పొడి వ్యర్థాలను నీలి రంగు డబ్బాలో వేయాలని తెలియజేస్తున్నారు. అదేవిధంగా హానికరమైన చెత్త (సూదులు, గడువుతీరిన మందులు, శానిటరీ ప్యాడ్లు వంటివి) ఎరుపు రంగు డబ్బాలో లేదా ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసి మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలని సూచిస్తున్నారు.

పాఠశాలల్లో విద్యార్థులకు..

మున్సిపాలిటీల్లోని ప్రధాన రహదారుల వెంబడి హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ యంత్రాంగం నిర్ణయించారు. ఇళ్లలోని చెత్తాచెదారాన్ని రోడ్లపై, ఖాళీ స్థలాల్లో పారవేయకుండా అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతపై పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్వచ్ఛసర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకులు సాధించేందుకు మున్సిపల్ యంత్రాంగం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషిచేస్తున్నాం



స్వచ్ఛసర్వేక్షణ్‌లో రాష్ట్రాన్ని, అదేవిధంగా హుజూర్‌నగర్ పట్టణాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం. దీనికి మున్సిపాలిటీలోని ప్రజలు, నాయకులు, సీనియర్ సిటిజన్లు, ఎన్‌జీఓలు సహకరించాలి. వివిధ రకాల కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించి ఈసారి మెరుగైన స్వచ్ఛ ర్యాంక్ సాధించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం.

– ఎస్‌కే.యాకుబ్‌పాషా, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు

కోదాడరూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో కోదాడకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. మంగళవారం కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పాఠశాలల బాలబాలికల కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కోదాడ నియోజకవర్గంలో పలు క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని కోరారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని, క్రీడాభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, టీపీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, హెచ్‌ఎం గోవిందయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ ఆజంబాబా, కౌన్సిలర్ మామిడి పద్మావతి, మాజీ సర్పంచ్ సంపెట రవిగౌడ్, మామిడి రామారావు, క్రీడల కన్వీనర్ కొండలు, పీఈటీలు ఉన్నారు.

పాఠశాలలకు కొత్త వంట పాత్రలు

- మధ్యాహ్న భోజన వంట పాత్రలకు రూ.77.90 లక్షల నిధులు మంజూరు
- టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు సన్నద్ధం
- జిల్లా వ్యాప్తంగా 949 ప్రభుత్వ పాఠశాలలు
- తీరనున్న ఏజెన్సీ మహిళల ఇబ్బందులు



నాగారం జెడ్పీహెచ్‌ఎస్‌లో వంట చేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళ(ఫైల్)

నాగారం : సర్కారు బడుల్లో ఏళ్ల తరబడి వినియోగిస్తున్న వంట పాత్రల కారణంగా సరైన శుభ్రత ఉండడం లేదు. అందులోనూ అల్యూమినియం పాత్రల్లోనే అన్నం, కూరలు వండుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎట్టకేలకు కొత్త పాత్రల కొనుగోలుకు నిధులు విడుదల చేసింది. ఐదేళ్ల కిందట చివరిసారిగా కొన్ని పాఠశాలలకు నిధులు విడుదల కాగా, తాజాగా మధ్యాహ్న భోజన పథకం(పీఎం పోషణ్) కోసం రాష్ట్ర విద్యాశాఖ నిధులు విడుదల చేసింది. ఇప్పటికే ఆయా జిల్లాలకు నిధులు విడుదల కావడంతో, టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ ప్రక్రియ ముగియగానే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వంటపాత్రలు అందించనున్నారు.

జిల్లాకు రూ.77.90 లక్షలు..

జిల్లావ్యాప్తంగా 949 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 63,509 మంది విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. వీరందరికీ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. అయితే చాలాచోట్ల కాలం చెల్లిన, అల్యూమినియంతో తయారైన వంట పాత్రలను వినియోగిస్తున్నారు. వీటివల్ల ఆహారం రుచికరంగా ఉండడం లేదనే ఫిర్యాదులతోపాటు, వంట చేసే ఏజెన్సీ మహిళలకు ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో అవసరమైనచోట వంట పాత్రల కొనుగోలుకు జిల్లాకు రూ.77,90,000 నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది.

పాఠశాలలకు వచ్చే వంట పాత్రలు ఇవే..

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో తెల్ల అన్నం వండే గిన్నెలు, ఇంగ్రీడియంట్స్ కోసం స్టీలు కంటైనర్లు, వండిన వాటిని వడ్డించేందుకు స్టీలు బకెట్లు, అన్నం వడ్డించే కఫ్గీర్ (చేతిగంటె), కూరలు వడ్డించేందుకు గంటెలు తదితర వంట సామగ్రిని పాఠశాలలకు అందించనున్నారు. వంట పాత్రల కోసం టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని, ఇది పూర్తయితే అన్ని పాఠశాలలకు కొత్త పాత్రలు అందేలా చూస్తామని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వంటపాత్రల కోసం నిధులు మంజూరు చేయడంతో వంట ఏజెన్సీ మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలువ కట్ట మరమ్మతులపై నివేదిక ఇస్తాం



వేములూరు రిజర్వాయర్ కట్టపై మాట్లాడుతున్న నీటిపారుదల శాఖ సీఈ ఓబీ రమేష్

మఠంపల్లి: వేములూరు రిజర్వాయర్ ఎడమ కాలువ కట్ట మరమ్మతులపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని నీటిపారుదల చీఫ్ ఇంజనీర్ ఓబీ రమేష్ అన్నారు. మండలంలోని యాతవాకిల్ల వద్ద గల చిన్న నీటి పారుదల ప్రాజెక్టు అయిన వేములూరు రిజర్వాయర్ ఎడమ కాలువ కట్ట బలహీనంగా ఉండడంతో ఇటీవల వర్షాలు వచ్చిన సమయంలో కట్ట పలుచోట్ల తెగింది. దీంతో వందలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈవిషయమై ఈ నెల 27న సాక్షి దినపత్రికలో 'బలహీనంగా వేములూరు కాలువ కట్ట' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం నీటిపారుదల చీఫ్ ఇంజనీర్ ఓబీ రమేష్, ఎస్ఈ ధర్మతేజ, ఈఈ రామ్‌కిశోర్, డీఈ భిక్షం, ఏఈ శ్రీనివాస్ బృందం వేములూరు రిజర్వాయర్‌ను, ఎడమ కాలువ కట్టను పరిశీలించారు. అనంతరం సీఈ రమేష్ మాట్లాడుతూ ఎడమ కాలువ కట్టను వరదాపురం వద్ద వెంకటనరసయ్య మిల్లు నుంచి మంచ్యాతండా రైల్వే బ్రిడ్జి వరకు, అదేవిధంగా వేములూరు రిజర్వాయర్ కట్ట నుంచి వెంకటనరసయ్య మిల్లు వరకు పరిశీలించామన్నారు. కట్ట మరమ్మతుల విషయమై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. కాగా మంచ్యాతండా మాజీ ఉప సర్పంచ్ చంద్రు నాయక్, నాయకులు మాలోతు బాలునాయక్ తదితరులు కాలువ కట్టకు సాధ్యమైనంత తొందరగా మరమ్మతులు, సీసీ లైనింగ్ పూర్తి చేయాలని అధికారులను కోరారు. వారి వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, లస్కర్లు కోటాలు, నరసింహ తదితరులు ఉన్నారు.

మత్స్య కార్మికుల సంక్షేమానికి కృషి

పెన్‌పహాడ్ : మత్స్య సహకార సంఘాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా మత్స్యశాఖ అధికారి నాగులునాయక్ అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని 8 గ్రామాల్లో 30 కుంటలకు 2లక్షల 89 వేల చేప పిల్లలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాలునాయక్ సిబ్బంది మల్లికార్జున్, ఉపేందర్, సుమలత, రోజి, మత్స్య కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



చేప పిల్లలను పంపిణీ చేస్తున్న నాగులునాయక్

దళారులకు పంటలు అమ్మొద్దు

- దీపావళి తర్వాత ముమ్మరంగా పత్తి, ధాన్యం కొనుగోళ్లు
- ప్రభుత్వ నిబంధనలు పాటించి మద్దతు ధర పొందాలి
- జిల్లా మార్కెటింగ్ అధికారి సంతోష్‌కుమార్ సూచన

'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన

భానుపురి (సూర్యాపేట) : 'రైతులు తొందరపడి దళారులను నమ్మి తక్కువ ధరకు తమ పంటలను అమ్ముకోవద్దు. రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఒకటి రెండు రోజుల్లోనే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయి. దీపావళి పండుగ తర్వాత వరి, పత్తి కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతాయి. ఏ సమస్య వచ్చినా రైతులకు అండగా ఉండేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది' అని జిల్లా మార్కెటింగ్ అధికారి సంతోష్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం 'సాక్షి దినపత్రిక' ఆధ్వర్యంలో జిల్లాలో వరి, పత్తి కొనుగోళ్లపై రైతుల ఇబ్బందులు జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చేందుకు ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. వరి, పత్తి కొనుగోళ్లపై రైతులు అడిగిన ప్రశ్నలకు జిల్లా మార్కెటింగ్ అధికారి సావధానంగా సమాధానం చెప్పారు.

ప్రశ్న : ఐకేపీ సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభిస్తారు ?

–మల్లెపాక యాకయ్య, లక్ష్మీపురం, నాగారం మండలం

డీఎంఓ : జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు యంత్రాంగం సిద్ధంగా ఉంది. ఇప్పటికే మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన పరికరాలను అందించాం. రెండు మూడు రోజుల్లోనే కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ప్రారంభమవుతాయి.

ప్రశ్న : సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ప్రారంభమవుతాయి ?

–కడెం లింగయ్య, తిరుమలగిరి

డీఎంఓ : ఇప్పటికే జిల్లాలో ఉన్న ఏడు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేశాం. దీపావళి తర్వాత రైతులు ఈ కేంద్రాలకు పత్తిని తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలి.

ప్రశ్న : కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యానికి రక్షణ లేకుండా పోయింది. రైతుల పరిస్థితి ఏంటి?

–గంగాధర్, తిరుమలగిరి

డీఎంఓ : త్వరలోనే కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ప్రారంభమవుతాయి. ధాన్యానికి భద్రత విషయమై డీఆర్‌డీఏ అధికారులకు, అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా. స్థానికంగా రైతులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సహకరించాలి.



రైతులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మార్కెటింగ్ అధికారి సంతోష్‌కుమార్

ప్రశ్న : 17 శాతం తేమ లేకుండా ధాన్యం తీసుకురావొచ్చా ?

–డి.భిక్షం, దాచారం, నేరేడుచర్ల మండలం

డీఎంఓ : తేమ శాతం నిబంధన రాష్ట్రవ్యాప్తంగా ఉంది. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేయాలంటే కనీసం ఈమాత్రం తేమశాతం ఉంటేనే సాధ్యపడుతుంది. ఎక్కువ తేమ ఉంటే ధాన్యాన్ని నష్టపోవాల్సి ఉంటుందనే కారణంతో తేమ శాతాన్ని నిర్ణయించారు. రైతులు ఈ విషయంలో అధికారులకు సహకరించాలి.

ప్రశ్న : సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులకు పత్తిని అమ్ముకుని నష్టపోతున్నాం ఎప్పటి నుంచి సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారు ?

– శ్రీనివాస్, చింతలపాలెం

డీఎంఓ : జిల్లాలో ఏడు జిన్నింగ్ మిల్లులను సీసీఐ కేంద్రాలుగా గుర్తించాం. దీపావళి తర్వాత కొనుగోళ్లు జరుగుతాయి. రైతులు ఆందోళన చెందొద్దు. ప్రైవేట్ వ్యక్తులకు పత్తిని విక్రయించి నష్టపోవద్దు.

ప్రశ్న : పత్తికి బయట అనుకూలమైన ధర లేదు. ఎక్కడ అమ్ముకోవాలి ?

–సుధాకర్ ఆత్మకూర్ ఎస్

డీఎంఓ : రైతులు ఎవరూ తొందరపడి పత్తిని ప్రైవేటు వ్యాపారులకు అమ్మొద్దు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో దీపావళి నుంచి పత్తిని కొనుగోలు చేస్తారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7521 తగ్గకుండా ధర కల్పిస్తాం. రైతులు ఓపిక పట్టాలి.

ప్రశ్న : ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వాతావరణం సహకరించకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కేంద్రాలు ప్రారంభించిన కాంటాలు ఎందుకు వేయడం లేదు ?

– చిట్యాల శ్రీనివాస్‌రెడ్డి, మోతె

డీఎంఓ : జిల్లాలో దొడ్డు ధాన్యం సాగు తక్కువగానే ఉంది. కొనుగోళ్లు ప్రారంభమైతే తొందర్లోనే పూర్తవుతాయి. డీఆర్‌డీఏ అధికారులు, అదనపు కలెక్టర్ దృష్టికి ధాన్యం కొనుగోళ్ల విషయాన్ని తీసుకెళ్లే ప్రయత్నం చేస్తా. ఒకటి రెండు రోజుల్లోనే కాంటాలు ప్రారంభం అవుతాయి. రైతులు తేమశాతం ఎక్కువగా లేకుండా ప్రభుత్వ నిబంధన మేరకు ధాన్యాన్ని తీసుకురావాలి.

ప్రశ్న : సన్న ధాన్యానికి బోనస్ ఎప్పుడు ఇస్తారు?

–కుందూరు వెంకటరెడ్డి, మోతె

డీఎంఓ : జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన సన్న ధాన్యానికి బోనస్ చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ధాన్యం బిల్లులతో పాటు బోనస్‌ను ప్రభుత్వం రైతుల అకౌంట్లలో జమ చేస్తుంది. ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదు.

క్లుప్తంగా

బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేయాలి

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో విద్యార్థులకు బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేయాలని ఎంజీయూ రిజిస్ట్రార్ ఎ. రవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 75శాతం హాజరు నిబంధనను విధిగా పాటించాలని, హాజరు ఆధారంగానే విద్యార్థులను పరీక్షలకు అనుమతిస్తామన్నారు. హాజరు గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆయన సూచించారు.

స్మార్ట్‌ఫోన్ కొనివ్వలేదని బాలుడి ఆత్మహత్య


శివ (ఫైల్)

రామన్నపేట: తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్ కొనివ్వడం లేదని ఉరేసుకుని బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రామన్నపేట మండలం పల్లివాడ గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లివాడ గ్రామానికి చెందిన మహంకాళి నర్సింహ, లక్ష్మమ్మ దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు మహంకాళి శివ(15) గత ఆరునెలలుగా వరికోత మిషన్‌పై హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా తనకు స్మార్ట్‌ఫోన్ కొనివ్వమని తల్లిదండ్రులను అడుగుతున్నాడు. స్మార్ట్‌ఫోన్ కొనే విషయంలో సోమవారం కుటుంబ సభ్యుల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన శివ తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయంలో ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూసేసరికి శివ ఉరికి వేలాడుతూ కనిపించాడు. మంగళవారం మృతుడి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు.

క్రిబ్‌కో ఆర్‌జీబీ మెంబర్‌గా బేతవోలు పీఏసీఎస్ చైర్మన్


బజ్జూరి రవీందర్‌రెడ్డి

చిలుకూరు: మండలంలోని బేతవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బజ్జూరి రవీందర్‌రెడ్డి క్రిబ్‌కో ఆర్‌జీబీ మెంబర్‌గా నియమితులయ్యారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో తనను ఏకగ్రీవంగా క్రిబ్‌కో ఆర్‌జీబీ మెంబర్‌గా నియమించినట్లు తెలిపారు. ఈ మేరకు క్రిబ్‌కో మార్కెటింగ్ మేనేజర్ రామకృష్ణయ్య చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

వలిగొండ: మండలంలోని నర్సయ్యగూడెంలో గల జోసెఫ్ చర్చి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు పసుపు పచ్చ, నలుపు రంగు చెక్స్ షర్ట్, నీలి రంగు లుంగి ధరించాడని, అతడి వయస్సు 55 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉంటుందని ఎస్‌ఐ యుగంధర్ పేర్కొన్నారు. 5.2 నుంచి 5.5 అడుగుల ఎత్తు, నలుపు రంగులో ఉన్నాడని, పొడవాటి తెలుపు గడ్డం కల్గి ఉన్నాడని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712862484, 8712882810 నంబర్లను సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

పండుగ పూట పస్తులేనా!

- డిగ్రీ గెస్ట్ ఫ్యాకల్టీకి ఐదు నెలలుగా అందని జీతాలు
- కుటుంబాన్ని పోషించలేక ఇబ్బందులు



రామగిరి(నల్లగొండ): డిగ్రీ గెస్ట్ ఫ్యాకల్టీకి ఐదు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యా సంవత్సరం మొదలై ఐదు నెలలు అవుతున్నా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న సుమారు 105 మంది గెస్ట్ ఫ్యాకల్టీకి నేటి వరకు జీతాలు అందలేదు. దీంతో పిల్లల స్కూలు ఫీజులు కట్టలేక, రోజువారి ఖర్చులు వెళ్లదీయలేక అష్టకష్టాలు పడుతున్నారు. జీతాలు విడుదల చేసి తమ జీవితాలు రోడ్డున పడకుండా చూడాలని పలుమార్లు ప్రభుత్వాన్ని కోరినా స్పందన లేదని వాపోతున్నారు. దీపావళి వరకైనా తమ జీతాలు వస్తాయని అనుకున్నా వారికి నిరాశే మిగిలింది.

ప్రతి నెలా వేతనాలు చెల్లించాలి



ఐదు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చాలీచాలని జీతాలు ఒక వైపు అయితే, ప్రతి నెలా వేతనాలు రాక రోజు వారి ఖర్చులకు డబ్బులు లేక అవస్థలు పడుతున్నాం. ప్రతి నెల వేతనాలు చెల్లిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

– ఎస్‌కె. గిరిబాబు, గెస్ట్ ఫ్యాకల్టీ, హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల

అప్పు చేసి స్కూల్ ఫీజులు చెల్లిస్తున్నాం



సరైన సమయానికి వేతనాలు రాకపోవడంతో పిల్లల స్కూల్ ఫీజులు, నెలవారీ ఖర్చులకు అప్పులు చేస్తున్నాం. వేతనాలు వచ్చే సరికి వడ్డీలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం స్పందించి ఆలస్యం చేయకుండా వేతనాలు చెల్లించాలి.

– ఎస్. ప్రభాకర్, గెస్ట్ ఫ్యాకల్టీ, ఎన్జీ కళాశాల, నల్లగొండ

పోస్టాఫీసుల్లోనూ ఆరు నెలలుగా..

మిర్యాలగూడ టౌన్: సూర్యాపేట, నల్లగొండ డివిజన్ పరిధిలో గల పోస్టాఫీసుల్లో తాత్కాలిక ఉద్యోగులుగా పని చేస్తున్నావారికి ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. దసరా పండుగకు వేతనాలు వస్తాయని తాత్కాలిక ఉద్యోగులు ఎంతో ఆశపడ్డారు కానీ రాలేదు. దీపావళి పండుగ కూడా రావడంతో ఈసారి కూడా పస్తులు ఉండాల్సిందేనా అంటూ తాత్కాలిక ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట డివిజన్‌లో 28 సబ్ పోస్టాఫీసులు, నల్లగొండ డివిజన్ పరిధిలో 29 సబ్ పోస్టాఫీసులు ఉన్నాయని, ఆయా పోస్టాఫీసుల్లో 114 మంది తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.15వేల వరకు ఇవ్వాల్సి ఉంది. ప్రధాన పోస్టాఫీసు ఉన్నతాధికారులను అడిగితే ఫండ్ రాలేదని, పైనుంచి ఉత్తర్వులు రాగానే ఇస్తామంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కరికి సుమారు రూ.లక్ష వరకు రావాల్సి ఉందని తాత్కాలిక ఉద్యోగులు అంటున్నారు. దసరా పండుగకు ఉద్యోగులకు రెండు నెలల బోనస్ రాగా... కనీసం తాత్కాలిక ఉద్యోగులకు ఒక్క నెల వేతనం కూడా ఇవ్వలేదని అంటున్నారు.

దైద నాగరాజుకు జాతీయ స్ఫూర్తి పురస్కారం


పురస్కారం అందుకుంటున్న నాగరాజు

నార్కట్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన దైద నాగరాజు సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ స్ఫూర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల త్యాగరాయ గాన సభలో సూర్యాపేట జిల్లాకు చెందిన హోప్ స్వచ్ఛంద సేవా సమితి, సింధు ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు దైద వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ స్ఫూర్తి పురస్కారాల కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత శాంతిబాయి, కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యుడు, డాక్టర్ నాళేశ్వరం శంకరం చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. సామాజిక సేవా రంగంలో తాను చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారం అందజేసినట్లు నాగరాజు తెలిపారు,

పోలీసుల అదుపులో నిందితుడు


నిందితుడిని పట్టుకున్న పోలీసులు

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని కట్టమైసమ్మ దేవాలయంలో బీరు సీసాలు పగులగొట్టి, మున్సిపల్ కార్యాలయం కిటికీ అద్దాలు ధ్వంసం చేసి, అంగన్‌వాడీ కేంద్రం తాళం విరగగొట్టి గుడ్లు చోరీ చేసిన యువకుడిని సోమవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి మండలం శివారెడ్డిగూడేనికి చెందిన చిలువేరు కృష్ణకాంత్ కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా లేక పట్టణ కేంద్రంలో రోడ్ల వెంట తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 27వ తేదీ అర్ధరాత్రి రోడ్డు పక్కన దొరికిన బీరు సీసాలను తీసుకొని కట్టమైసమ్మ దేవాలయం ముందు ఉన్న బొడ్రాయికి విసిరికొట్టాడు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయం కిటికీ అద్దాలను పగులగొట్టాడు. అంగన్‌వాడీ కేంద్రం తాళం విరగ్గొట్టి అందులో ఉన్న గుడ్లను ఉడకబెట్టుకొని తిన్నాడు. సోమవారం రాత్రి కూడా అంగన్‌వాడీ కేంద్రం తాళం విరగొట్టేందుకు యత్నిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు అతడిని పట్టుకుని విచారించగా.. నిజం ఒప్పుకున్నాడు. అతడికి మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో బుధవారం హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ పిచ్చాసుపత్రికి తరలించనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కృష్ణకాంత్ తండ్రి ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, తల్లి ఇతని చేష్టల వల్ల విసుగుచెంది వదిలేసి పోచంపల్లిలో ఉంటున్నట్లు తెలిసింది. గతంలో కూడా కృష్ణకాంత్ శివారెడ్డిగూడెంలో పలు ఇళ్లను ధ్వంసం చేశాడని, పది రోజుల క్రితం పోచంపల్లి అయ్యప్పగుడి వద్ద సీసాలు పగులగొట్టి వీరంగం సృష్టించాడని తెలిసింది.

సాంస్కృతిక పాఠశాల నుంచి వెళ్లిపోయిన విద్యార్థి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక విద్యా పాఠశాలకు చెందిన విద్యార్థి మంగళవారం ఎవరికీ చెప్పకుండా పాఠశాల నుంచి వెళ్లిపోయాడు. రోజు మాదిరిగానే మంగళవారం మనోజ్ సాయి అనే విద్యార్థి తోటి విద్యార్థులతో కలిసి స్నానం చేయడానికి వెళ్లాడు. స్నానం ఎవరు ముందు చేయాలనే దానిపై విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. తోటి విద్యార్థులు మనోజ్ సాయిపై సాంస్కృతిక విద్యా పాఠశాల నిర్వాహకులకు ఫిర్యాదు చేశారు. స్నానం చేసే సమయంలోనే కాకుండా ఆయా సందర్భాల్లో తమతో పనులు చేయిస్తున్నాడని ఫిర్యాదులో తెలిపారు. దీంతో మనోజ్ సాయిని పాఠశాల నిర్వాహకులు మందలించడంతో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఈ విషయమై ప్రిన్సిపాల్ జానకిని వివరణ కోరగా.. విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణతో తమ కు ఫిర్యాదు వచ్చిందని, దీంతో మందలించడంతో ఎవరికీ చెప్పకుండా వెళ్లాడని తెలిపారు. ప్రస్తుతం మనోజ్‌సాయి తమ కుటుంబ సభ్యుల చెంతకు చేరాడని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


నరసింహారావు (ఫైల్)

మఠంపల్లి: ఇసుక మిల్లులో పనిచేస్తున్న ఆపరేటర్ ప్రమాదవశాత్తు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మఠంపల్లి ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం చౌటపల్లికి చెందిన వంటిపులి నరసింహారావు (25) మండల కేంద్రం సమీపంలోని ఎస్‌వీ బిల్డ్స్ ఇసుక మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం మిల్లులో బెల్టు సరిచేయబోయి కింద జారిపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య పుష్ప మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

త్రియుండ్ పర్వతాన్ని అధిరోహించిన గురుకుల విద్యార్థిని



త్రియుండ్ పర్వతంపై పర్వతారోహకులతో ప్రతిభ, స్రవంతి (వృత్తంలో)

బీబీనగర్: మండలంలోని గురుకుల మహిళా ఆర్మీ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని ప్రతిభ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి స్రవంతి హిమాచల్‌ప్రదేశ్‌లోని 2875 మీటర్ల ఎత్తు గల త్రియుండ్ పర్వతాన్ని మంగళవారం అధిరోహించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయి పర్వతారోహక శిక్షణ సంస్థలో జరుగుతున్న జాతీయ సాహస శిక్షణ శిబిరంలో పాల్గొన్న వారు ఈ పర్వతాన్ని అధిరోహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నిరూప, అధ్యాపకులు వారిని అభినందించారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చు


రైతులకు కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

గరిడేపల్లి: నిరుపేద ఎస్సీ కులాల రైతులు పెరటి కోళ్ల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చనని గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సీనియర్ హెడ్ డి. నరేష్ తెలిపారు. మంగళవారం గడ్డిపల్లి కేవీకేలో ఐసీఏఆర్ అటారీ, హైదరాబాద్ ఆర్థిక సహకారంతో ఎస్సీ ఉప ప్రణాళికలో భాగంగా రైతులకు పెరటి కోడి పిల్లలను (రాజశ్రీ) ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూమి లేని రైతులు పెరటి కోళ్లను పెంచుకోవడం ద్వారా ఏవిధంగా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎస్. సుగంధి రైతులకు సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ఎ. కిరణ్, టి. మాధురి, కట్టెల శ్రీను పాల్గొన్నారు.

కల్లుగీత కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ


మాట్లాడుతున్న వెంకటరమణ

భానుపురి (సూర్యాపేట): కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. మంగళవారం సూర్యాపేటలో నిర్వహించిన సంఘం ఆఫీస్ బేరర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కల్లుగీత వృత్తిలో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కల్లుగీత కార్పొరేషన్ ఉద్దేశం వృత్తిలో ఆధునీకరణ పద్ధతులు తీసుకురావడం, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాల్సి ఉన్నా నిధుల కేటాయింపు సరిగా లేకపోవడంతో ఆ పనిచేయడం లేదన్నారు. గీత కార్మికుల సంక్షేమం కోసం కేటాయించిన డబ్బులతో హైదరాబాద్‌లో నీరా కేఫ్ నిర్మించారని అన్నారు. ఇది టూరిజం శాఖ ఆధీనంలో ఉండడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎల్గూరి గోవింద్, కార్యదర్శి మడ్డి అంజిబాబు, ఉపాధ్యక్షులు అబ్బగాని భిక్షం, తుమ్మల సైదయ్య, గుణగంటి కృష్ణ, సహాయ కార్యదర్శి ఉయ్యాల నగేష్, బత్తుల జనార్దన్, జేరిపోతుల కృష్ణ, బట్టిపెల్లి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక


తరుణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల(ఎన్జీ కాలేజ్)కు చెందిన బీకామ్ ఫస్టియర్ విద్యార్థి బి. తరుణ్ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం తరుణ్‌ను కళాశాల సిబ్బంది అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పిల్లి సురేష్‌బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పరంగి రవికుమార్, సీఓఈ బి.నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వెల్దండి శ్రీధర్‌బాబు, డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ మునిస్వామి, ఎన్‌సీసీ ఆఫీసర్ సీహెచ్. సుధాకర్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ.. ముగ్గురికి గాయాలు


లారీ ఢీకొనడంతో బోల్తాపడిన ఆటో

వేములపల్లి: పండ్ల లోడుతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో మంగళవారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా కోనూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన పగిడిపత్తి నర్సయ్య, ఉయ్యాల రమేష్, దొడ్లేరుకు చెందిన ఖాసీం సాయబ్ పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. హైదరాబాద్‌లో పండ్లు కొనుగోలు చేసేందుకు అనంతవరం గ్రామానికి చెందిన బాజీసైదాకు చెందిన ఆటోలో సోమవారం రాత్రి బయల్దేరారు. మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో పండ్లను లోడ్ చేసుకుని తిరిగి తమ స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మంగళవారం సాయంత్రం వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై గల మహాతేజ మిల్లు వద్దకు రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ అతివేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడగా.. ఆటోలో ప్రయాణిస్తున్న నర్సయ్యకు కాళ్లు, చేతులకు, ఖాసీం సాయబ్‌కు తలకు, డ్రైవర్ బాజీసైదాకు తలకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే గాయపడిన వారిని అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారు వారి స్వగ్రామాలకు వెళ్లారు.

హైకోర్టు ఆదేశంతో సర్టిఫికెట్లు అందజేత


సర్టిఫికెట్లతో ఫణికుమార్

భైంసా(ముధోల్): నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి గ్రామానికి చెందిన సామల ఫణికుమార్ నిర్మల్ జిల్లాలోని బాసర ట్రిపుల్ ఐటీ నుంచి మెకానికల్ విభాగం నుంచి 2023లో ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. ఫణికుమార్ ఏడాదిన్నర కాలంగా తన ఒరిజినల్ సర్టిఫికెట్ల కోసం క్యాంపస్ చుట్టూ తిరుగుతున్నా క్యాంపస్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో తన సర్టిఫికెట్లు ఇప్పించాలని ఫణికుమార్ ఇటీవల హైకోర్టులో కేసు వేయగా.. ఫీజు చెల్లించలేదని ఏ విద్యార్థి సర్టిఫికెట్లు ఆపకూడదని హైకోర్టు ఆదేశించింది. దీంతో సోమవారం ఫణికుమార్ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు వచ్చి అధికారులను కలవడంతో ఒరిజినల్ సర్టిఫికెట్లు అందజేశారు.

జీవన్‌దాన్ సంస్థకు అవయవాలు దానం


జూకంటి కుమార్

ఆలేరురూరల్: ఆలేరు పట్టణానికి చెందిన జూకంటి కుమార్ అనారోగ్యంతో పది రోజుల క్రితం ఆస్పత్రిలో చేరాడు. మంగళవారం ఉదయం కుమార్ బ్రెయిన్ డెడ్ అయినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. కుమార్ కుటుంబ సభ్యులు అంగీకారం మేరకు అతడి అవయవాలను జీవన్‌దాన్ సంస్థకు దానం చేశారు. కుమార్ భౌతికకాయానికి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు, స్నేహితులు నివాళులర్పించారు.

సాగర్ నుంచి రెండు గేట్ల ద్వారా నీటి విడుదల


దిగువకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ నుంచి రెండు క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. జలాశయంలో నీటిమట్టం గరిష్ట స్థాయిలో 590 అడుగులుగా ఉంది. ఎగువ నుంచి వస్తున్న 69,386 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా.. క్రస్ట్ గేట్ల ద్వారా 19,880 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 29,476 క్యూసెక్కులు, కుడి, ఎడమ, ఏఎమ్మార్పీ, వరద కాల్వలకు 20,030 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

35 కిలోల గంజాయి పట్టివేత

భువనగిరి క్రైం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు రెండు కార్లలో నలుగురు వ్యక్తులు 35కిలోల గంజాయిని తరలిస్తుండగా మంగళవారం భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపల్లి వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు రెండు కార్లను ఆపి తనిఖీ చేయగా.. 35 కిలోల గంజాయి దొరికింది. నలుగురు వ్యక్తులు ఒక కారులో గంజాయిని తీసుకెళ్తుండగా.. వారి ముందు మరో కారు ఎస్కార్ట్‌గా వెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నలుగురిని అరెస్ట్ చేసి రెండు కార్లతో పాటు పట్టుబడిన గంజాయిని, 3 మొబైల్ ఫోన్స్‌ను సీజ్ చేసి విచారణ జరుపుతున్నట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

కార్తీక మాసోత్సవాలకు అంతా సిద్ధం

- యాదాద్రి కొండపై ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ భాస్కర్‌రావు వెల్లడి


సత్యనారాయణస్వామి వ్రత మండపం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నవంబర్ 2 నుంచి కార్తీక మాసోత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు. కొండ పైన మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్తీక మాసంలో యాదాద్రి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపించేందుకు భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో కొండ దిగువన వ్రత మండపంలో హాల్స్, పూజ సామగ్రి, వ్రత పీటలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పాతగుట్టలో సైతం భక్తులు వ్రతాలు జరిపించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వ్రత మండపం వద్ద సీసీ రోడ్లు, ఫుట్‌పాత్ టైల్స్, ప్రసాద విక్రయశాలలను సిద్ధం చేస్తున్నామని, వ్రత మండపం వద్ద వాహనాలు నిలుపకుండా కొత్తగా వ్యాలెట్ పార్కింగ్‌ను ప్రవేశపెట్టామన్నారు.

దంపతులు, పిల్లలకే అనుమతి..

వ్రత మండపంలోకి దంపతులతో పాటు ఇద్దరు పిల్లలకు మాత్రమే అనుమతి ఇస్తామన్నారు. మిగతా వారిని వ్రత మండపం ఆవరణలో కూర్చోబెడతామని, అక్కడ ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులకు ట్రైసైకిళ్లు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ ఏడాది స్పెషల్ వ్రతాలు లేవన్నారు. సత్యనారాయణస్వామి వ్రతాలకు సంబంధించి టిక్కెట్ల ధరను పెంచడం లేదన్నారు. గతంలో మాదిరిగానే రూ.800కే టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు తెలిపారు. వ్రతాలు అయిపోయిన తర్వాత మండపం నుంచి కొండపైకి, బస్టాండ్ వద్దకు స్పెషల్ బస్సు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రతిరోజు ఆరు బ్యాచ్‌లు..

వ్రత మండపంలో ప్రస్తుతం రోజుకు నాలుగు బ్యాచ్‌లుగా వ్రతాలు జరుగుతున్నాయని, కార్తీక మాసంలో నెలరోజుల పాటు ప్రతిరోజు ఆరు బ్యాచ్‌లతో వ్రతాలు నిర్వహిస్తామన్నారు. మొదటి బ్యాచ్ ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు, రెండో బ్యాచ్ 9గంటల నుంచి 10గంటల వరకు, మూడో బ్యాచ్ 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, నాల్గో బ్యాచ్ మధ్యాహ్నం 1గంటల నుంచి 2గంటల వరకు, ఐదో బ్యాచ్ మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు, ఆరో బ్యాచ్ 5గంటల నుంచి 6గంటల వరకు ఉంటుందన్నారు. నవంబర్ 15వ తేదీన కార్తీక శుద్ధ పూర్ణిమ రోజున ఉదయం 5.30గంటల నుంచి రాత్రి 7గంటల వరకు ఎనిమిది బ్యాచ్‌లతో వ్రతాలు నిర్వహిస్తామన్నారు. పాతగుట్ట ఆలయంలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రతిరోజు 5 బ్యాచ్‌లతో వ్రతాలు ఉంటాయని, కార్తీక శుద్ధ పూర్ణిమ రోజున ఆరు బ్యాచ్‌లతో వ్రతాలు ఉంటాయన్నారు. ఒక్కో బ్యాచ్‌లో ఒక్కో హాల్‌లో 250 జంటలు పాల్గొనేలా చర్యలు తీసుకుంటామన్నారు. 15వ తేదీన ప్రధానాలయం, శివాలయంలో సాయంత్రం 6.30గంటలకు ఆకాశ దీపారాధన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

31న ఆలయ వేళల్లో మార్పులు..

గురువారం దీపావళి పండుగను పురస్కరించుకొని యాదాద్రి ఆలయ నిత్య కైంకర్యాల్లో మార్పులు చేశామని ఈఓ తెలిపారు. ఉదయం 3.30గంటల నుంచి 4గంటల వరకు సుప్రభాతం, 4.15 నుంచి 4.45గంటల వరకు స్వామి, అమ్మవార్లకు మంగళ హారతులు, 4.45 నుంచి 6.30గంటల వరకు తిరువారాధన, బాలబోగం ఆరగింపు, 6.30గంటల నుంచి 7.30గంటల వరకు స్వామివారికి నిజాభిషేకం, 7.30గంటల నుంచి స్వామివారికి సహస్ర నామార్చన, సుదర్శన నారసింహ హోమం ఉంటుందని, 8.15గంటల నుంచి సర్వ దర్శనాలు కల్పిస్తామన్నారు. ఈ నేపథ్యంలో దీపావళి రోజు సుప్రభాత దర్శనం టిక్కెట్లు రద్దు చేశామన్నారు.